ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 10 ఆగస్టు 2025

నేడు ధర్మారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

ధర్మారం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులతో ఆదివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని ధర్మారం టీజీఎన్‌పీడీసీఎల్ అదనపు సహాయక ఇంజనీరు ఎండి ఖాసీమ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్మారం సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం, కొత్తపల్లి, బొమ్మరెడ్డిపల్లి, ఎర్రగుంటపల్లి, మేడారం, గోపాల్‌రావుపేట, గ్రామాలకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్, పత్తిపాక, నర్సింగాపూర్, నాయకంపల్లి, బంజేరుపల్లి, తండాబి గ్రామాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సాగునీరు అందించాలి

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతాంగం శ్రీరాం సాగర్ కాలువ ద్వారా ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుందని ఎంతో ఆశతో ఉన్నారని ,వర్షాలు కురవకపోవడంతో సాగునీరు ఇబ్బందికరంగా మారిందని , వెంటనే సాగునీరు అందించాలని సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మాదారపు వేణుగోపాల్‌రావు శనివారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగుచేసిన రైతుల్లో సాగునీటి సరఫరా విషయమై అయోమయంలో ఉన్నారని, కాలువల ద్వారా సాగునీరు సరఫరా చేసే విధానంపై అధికారులు కనీసం స్పష్టత ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. కాలువల నీటిపై ఆధారపడి ఉన్న పంట పొలాల రైతులు సాగు చేయాలా వద్దా అనే అయోమయంలో ఉన్నారని , ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఫైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాలనీలో పోచమ్మ ఆలయంలో స్థిర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. అర్చకులు పూజాకార్యక్రమాలతో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పోచం దంపతులు పాల్గొన్నారు. నాయకులు ఆకుల శశికుమార్, అపర్ణ, మూకిరి రాజు, ఆకుల కుమార్, అనిల్, కండెసాగర్ పాల్గొన్నారు.



లెక్కలు ఉండవు.. నిబంధనలు పాటించరు

- రామగుండం బల్దియా స్టోర్‌లో అంతామాయ
- స్టాక్ రిజిష్టర్లు నామమాత్రం
- లక్షల విలువైన సామగ్రికి రక్షణ కరువు
- శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై విభాగాలకు స్టోర్‌లు

కోల్‌సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో కీలకమైన స్టోర్‌లలో లెక్కలు లేవు.. నిబంధనలు లేవు.. అన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. స్టోర్‌ల విషయంలో అనుసరించాల్సిన నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ స్టోర్‌లకు సంబంధించి 10, 20ఏళ్ల సామగ్రి, యంత్రాలకు సంబంధించి స్టాక్ రిజిష్టర్లు నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో స్టోర్ నిర్వహణ ఉంటుంది. సిబ్బంది, అధికారులు మారినప్పుడల్లా చార్జ్ సర్టిఫికెట్, టేక్ ఓవర్, హ్యాండ్ ఓవర్ రిజిష్టర్లు నిర్వహించాలి. అధికారులు ఎవరు మారినా కూడా స్టోర్‌ల నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మంచి నీటి సరఫరా, ఎలక్ట్రికల్, శానిటేషన్‌కు సంబంధించిన స్టోర్‌లు ఉన్నాయి. ప్రతి స్టోర్‌కు ఒక జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి ఇన్‌చార్జిగా, ఇంజనీర్లు, ఇతర అధికారులు మానిటరింగ్ అధికారులుగా ఉంటారు. కానీ రామగుండంలో స్టోర్‌ల నిర్వహణ గాలికి వదిలేశారనే ఆరోపణలున్నాయి. గతంలో సమ్మక్క - సారలమ్మ జాతరలో సీసీ కెమెరాల బిగింపునకు సంబంధించి టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. జాతర ఆ తరువాత అవి స్టోర్‌లోకి చేరాల్సి ఉంది. కానీ స్టోర్‌లలోకి రాలేదు. దీనితో మళ్లీ జాతరకు కొనుగోలు చేసి బిగించాల్సి వచ్చింది. ఎలక్ట్రికల్ విభాగంలో కొనుగోళ్లకు, నిర్వహణకు పొంతనే ఉండదు. ఎప్పటికప్పుడు స్టోర్ ఖాళీ అనే పరిస్థితే ఉంటుంది. ఎలక్ట్రికల్ పర్చేస్‌కు సంబంధించి గోల్‌మాల్ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. శానిటేషన్ విభాగంలోనైతే వరుస ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. శానిటేషన్ స్టోర్‌లలో సున్నం, బ్లీచింగ్, దోమల కెమికల్, పనిముట్లు, సబ్బులు, బెల్లంపల్లి, నూనె, తదితర కొనుగోళ్లు జరుపుతూనే ఉంటారు. సున్నం, బ్లీచింగ్ కొనుగోళ్లకు సంబంధించి ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. గతంలో స్టాక్ బుక్ అడ్జెస్టమెంట్లు జరిగేవనే ఆరోపణలున్నాయి. సాధారణంగా స్టాక్ వచ్చిన సమయంలో అధికారులు పరిశీలించి స్టోర్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో స్టాక్ రిజిష్టర్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు వాడకాన్ని కూడా రిజిష్టర్‌లో పేర్కొనాలి. కార్పొరేషన్‌లో బెల్లం, బ్లీచింగ్ పౌడర్, రెయిన్ కోట్లు, చెప్పుల కొనుగోళ్లకు సంబంధించి ఆరోపణలు వచ్చాయి. కార్మికుల సంఖ్యకు సరిపడా సామగ్రి రాలేదని, కొంత మంది కార్మికులకు ఇవ్వకపోవడంతో విమర్శలు వచ్చాయి. బెల్లాన్ని కార్మికులకు ఇవ్వకుండా దొడ్డిదారిన తరలించడం, వాటిని పశువులకు పెట్టామని

(మిగతా 8వ పేజీలో)

సీతారామ చంద్రస్వామి క్షేత్రంలో గోమాత పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న రైతులు

ఓదెల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన ఆలయం సీతారామ చంద్రస్వామి క్షేత్రంలో శ్రావణ శనివారం రైతులు గోమాత పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గరిమిళ్ల ప్రణీత్ ఆధ్వర్యంలో కలషాభిషేకం, వస్త్రాలంకరణ, అష్టోత్తర శతనామాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబాడి మల్లేష్ దంపతులు, బోడకుంట రామచంద్రం, తీర్థాల కుమారస్వామి, ఉపసర్పంచ్ తీర్థాల కుమార్, రామినేని రాజేంద్ర ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ఈ నెల 14 నుంచి రైతు బీమా

ఎలిగేడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి రైతు బీమా 8వ పాలసీ ప్రారంభమవుతున్నదని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ నెల నుంచి ప్రస్తుత జూన్ 5 వరకు కొత్తగా భూమి పాస్‌బుక్ తీసుకున్న రైతులందరికీ వారి నామినేషన్ పత్రాలు, ఫామ్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, రైతుభూమి పాస్‌బుక్ జిరాక్స్‌లు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు సుల్తాన్‌పూర్‌లో గణేష్, ఎలిగేడులో సురేష్, ధూళికట్టలో శరణ్యలకు సోమవారం నుంచి ఇవ్వాలని తెలిపారు. ఈ నెల 13లోగా వీటిని ఇవ్వాలని ఆయన తెలిపారు. 18 నుండి 59 ఏళ్ల వయస్సున్న రైతులందరు అర్హులని అన్నారు. నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే రైతు బీమా వర్తిస్తుందని ఏఓ పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో అంగన్‌వాడీ టీచర్లు

ఎలిగేడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు గత రెండు రోజుల నుంచి ఓటర్ల జాబితా సవరణలో విధులు నిర్వహిస్తున్నారని అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షులు ఓదేశ్వరి శనివారం తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, భారతిలు ఓటర్ల జాబితా వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహించి, అనంతరం టీచర్లు, ఆయాలు ఓటర్ల జాబితా సవరణ కోసం వెళ్లినట్లు తెలిపారు.

కిటకిటలాడిన ఆర్‌టీసీ బస్టాండ్

- బస్సులు సరిపడా లేక ఇబ్బందులు



ఖని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ సందర్భంగా శనివారం గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఉదయం 7గంటల నుంచే బస్టాండ్ రద్దీగా మారింది. సమయానికి బస్సులు రాక ఇబ్బందులు పడగా వచ్చిన బస్సుల కోసం జనం పరుగులు తీశారు. వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, ఓదేడ్, బేగంపేట, మంథని, జమ్మికుంటకు వెళ్లే బస్సుల కోసం పడిగాపులు కాశారు. వచ్చిన బస్సుల్లో ఎక్కడానికి కుస్తీలు పడ్డారు. రాజేష్ థియేటర్, చౌరస్తా, ఫైవింక్లయిన్ బస్టాప్‌ల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని సర్వీసులు ఆపకుండానే వెళ్లిపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

రాఖీ పండుగ సందర్భంగా ఆర్‌టీసీ అధికారులు రాఖీ స్పెషల్ అంటూ ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేశారు. కరీంనగర్‌కు ఎక్స్‌ప్రెస్‌కు రూ.120 ఉంటే అదనంగా రూ.50వసూలు చేశారు. హైదరాబాద్‌కు కూడా అప్‌అండ్‌డౌన్ పేరిట స్పెషల్ చార్జీలను వసూలు చేశారు. ఇతర రూట్లలో కూడా స్పెషల్ బస్సులను తిప్పారు.



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న మహిళలు

ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

పెద్దపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క శనివారం హైదరాబాద్ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం, ఉత్పత్తి పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర క్యాబినెట్ విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలపై పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రాష్ట్ర సెక్రెటరీ వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా కలెక్టర్ తమ జిల్లా పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల వివరాలు, వాటిపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలను వారం రోజులలో పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, విద్యా సంస్థల వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను వారం రోజులలో పంపాలని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం గిరిజనులకు పంపిణీ చేసిన 6 లక్షల 17 వేల ఎకరాల్లో సోలార్ పంప్ సెట్‌లో ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని, ఎన్నికల సందర్భంగా 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. శనివారం పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధుకర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో గోదావరి బేసిన్‌లో మొత్తంగా 6 లక్షల ఎకరాలకే నీళ్లివ్వాలని నీటి నిర్వహణ కమిటీ కమిటీ నిర్ణయించిందన్నారు. ఇందులో ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల్లో 55 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉండగా 3,93,430 ఎకరాల్లో వరి పంటకు, 78,307 ఎకరాల్లో ఆరుతడి పంటలకు నీళ్లివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సారెస్పీ స్టేజీ 1లో 9.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, ప్రభుత్వం 2.34 లక్షల ఎకరాలకు మాత్రమే అందిస్తున్నదని, దాదాపు 7.3 లక్షల ఎకరాల పంటలను ఎండబెట్టే పాపానికి ఈ ప్రభుత్వం ఒడిగట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత 2022లో వానకాలం, యాసంగి కలిపి ఏకంగా 24,30,753 ఎకరాలు సాగవడం ఎస్సారెస్పీ చరిత్రలోనే రికార్డు అన్నా రు. అది కాళేశ్వరం ప్రాజెక్టు చలవేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.49 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని మాయమాటలు చెప్పి నేటి వరకు కేవలం రూ.21 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపు కున్నదన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, జక్కుల శ్రీకాంత్, గోపు ఐలయ్యానారాయణదాసు మారుతి, జిట్టవేన ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు

ఘనంగా నూలు పౌర్ణమి



నూతన యజ్ఞోపవీతధారణలో పద్మశాలీలు

ఫైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక హనుమాన్ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూలు పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం సామూహికంగా నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. ఈపూజల్లో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేష్, పద్మశాలీ సంఘం సభ్యులు కుర్మ శ్రీనివాస్, బండారి రాయమల్లు, గుండేటి ప్రభాకర్, కుమారస్వామి, ఓదేలు, రాజేశం, లక్ష్మణమూర్తి, భిక్షపతి, రవి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ రథోత్సవం



మార్కండేయ స్వామి రథోత్సవం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పద్మశాలి కులస్తుల ఆరాధ్య దైవమైన మార్కండేయుని రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీలు మార్కండేయుని ఫోటోను రథంపై ఉంచి గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగింపుగా కీర్తనలు చేస్తూ సాగిపోయారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు కనీస వేతనాలు ఇవ్వాలి



క్యాస శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు కనీస వేతనాలు అమలు చేసే విధంగా చూడాలని రామగుండం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు గట్ల కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వివిధ ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ పూర్తి చేసిన ల్యాబ్‌టెక్నీషియన్లకు కనీస వేతనం రూ.15వేల వరకు ఇప్పించాలని, ప్రస్తుతం రూ.7వేల నుంచి రూ.10వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తుండడంతో కుటుంబాలను పోషించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని, టెక్నీషియన్ కుటుంబ సభ్యులకు ఉచితంగా ఓపీ, 50శాతం ఐపీ, ల్యాబ్ టెస్ట్‌లకు రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సదానందం, శ్రీనివాస్ ఉన్నారు.

వేగవంతంగా వంద పడకల ఆస్పత్రి పనులు

ప్రజలకు అందనున్న వైద్య సౌకర్యాలు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వంద పడకలకు పెంచేందుకు చేపట్టిన పనులు వేగవంతగా జరుగుతున్నాయి. మరో ఆరు నెలల్లో ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. దీన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్షలు పర్యవేక్షిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పన్నేండళ్ల క్రితమే ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతో ఈ కళ సాకారం కానుంది. జిల్లా అస్పత్రిలో 30 పడకల ఆస్పత్రి కొనసాగింది. ఇన్‌పేషంట్లకు బెడ్లు లేక వరండాలో మంచాలు వేసి చికిత్సనందించేవారు. పరీక్షలకు ఇరుకు గదిలో క్యూలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరండాల్లో నిలువ నిలబడే స్థలం లేకుండా పోయింది. కలెక్టర్, ఎమ్మెల్యే ఆస్పత్రిపై శ్రద్ధ వహించడంతో ఆస్పత్రిలో మెరుగైన సేవలు పెరిగాయి. అన్ని రకాల పరీక్షలు శస్త్ర చికిత్సలు చేస్తుండటంతో జిల్లా ఆస్పత్రి పేరు ప్రజల్లో నాటుకపోయింది. దీంతో రోగుల తాకిడి విపరీతంగా పెరిగింది. గతంలో కంటే 20 ఇంతలు పెరిగి ఇబ్బందిగా మారింది. ఆస్పత్రి భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనాన్ని కూల్చి వేసి ఇక్కడున్న విభాగాలను మాతా శిశు సంక్షేమ ఆస్పత్రికి మార్చేశారు. ఇక్కడి నుంచి ప్రస్తుతం వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి దారి తీసింది.



పెద్దపల్లిలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి

- **రూ.30 కోట్ల నిధులు కేటాయింపు**

30 కోట్ల రూపాయల నిధులతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. జీ ప్లస్ 2 అంతస్తులతో 231 పిల్లర్లతో ఫైదు బ్లాకులుగా నిర్మాణం చేపట్టనున్నారు. ఏ, బీ సీ, డీ, ఈ బ్లాకులుగా విభజించారు. ఏ, సీ, బీ బ్లాకుల్లో వార్డులు కేటాయించనున్నారు. డీ బ్లాక్‌లో కారిడార్, ఈ బ్లాక్ కార్యాలయ నిర్వహణతో పాటు ఇతరత్రా అవసరాలకు వినియోగించనున్నారు. ఏడాదిన్నర కాల పరిమితితో అగ్రిమెంట్ ఉన్నప్పటికీ అంతకన్న ముందే పూర్తి కానుంది. కేవలం రెండు నెలలుగా పనులు ఎంతో చురుకుగా సాగుతున్నాయి. భవనానికి ఆవరణలో నీటి సంపు కొంత మేర అడ్డంకిగా మారింది. ఆ స్థలంలో నిర్మించే పనులు కొంత ఆలస్యంగా జరుగుతున్నాయి. అంతే కాకుండా మెటీరియల్ నిల్వ చేసేందుకు స్థలం అంతత మాత్రంగా ఉంది. దీంతో మెటీరియల్ వెంట వెంట తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. భవ నిర్మాణానికి కావాల్సిన అన్ని రంగాల కార్మికులు అందు బాటులో ఉన్నారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఆలస్యం జరుగకపోతే మరో ఆరు మాసాల్లో పనులు పూర్తి చేసి అప్పజెపుతామని కాంట్రాక్టర్ చెప్తున్నాడు. ఇందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

పండగ పూట విషాదం..

● జగిత్యాల జిల్లాలో అనారోగ్యంతో ఇద్దరు యువకుల మృతి


అనిల్(ఫైల్)

గొల్లపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో శనివారం రాఖీ పండగపూట విషాదం నెలకొంది. గొల్లపల్లి మండలం రాఘవ పట్నం గ్రామానికి చెందిన గరిగంటి అనిల్(24), తిర్మలాపూర్(పీడీ) గ్రామానికి చెందిన అన్వేష్(22) అనే యువకులు అనారోగ్యంతో మృతిచెందారు. రాఘవపట్నం గ్రామానికి చెందిన గరిగంటి అనిల్ హైదరాబాద్‌లో పీజీ చదువుతూ రాఖీ పండగ కోసం స్వగ్రామం వచ్చాడు. శనివారం ఉదయం తన అక్కా-చెల్లెళ్లతో రాఖీలు కట్టించుకున్న అనిల్ మధ్యాహ్నాం ఇంట్లో నిద్రపోయాడు. సాయం త్రం అయినప్పటికీ లేవకపోవడంతో కుటుంబ సభ్యులు నిద్ర లేపేందుకు యత్నించారు. అయితే అతడిలో ఎలాంటి చలనం లేకుండా ఉండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాలలోని ఏరియా అసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అనిల్ గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తిర్మలాపూర్‌కు చెందిన అన్వేష్ అనే యువకుడు చిన్నతనం నుంచి తలసేమియాతో బాధపడుతూ శనివారం మృతిచెందడంతో బాధిత కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది.

ఒంటరితనం భరించలేక ..

ఉరి వేసుకుని ఆత్మహత్య

గంగాధర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌లో ఒంటరితనం భరించలేక ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం నమిలికొండకు చెందిన అల్లకుంట గంగారాం(70) గంగాధర మండలం మధురానగర్‌లోని పెద్దకుమారుడు శ్రీనివాస్‌తో ఉంటున్నాడు. ఐదు సంవత్సరాల నుంచి గంగారాం భార్య, కూతురు, కొడుకు వరుసగా మృతిచెందారు. దీంతో బాధను తట్టుకోలేక మద్యానికి బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక బాధతో రెండు రోజులు క్రితం ఇంట్లో నుంచి వెళ్లాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెదికినా ఆచూకీ దొరకలేదు. శనివారం ఇంటి షటర్లు తెరిచే సరికి ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



● పకడ్బందీ కార్యాచరణ రూపొందించిన ట్రాన్స్‌కో అధికారులు

● పొలం బాటతో రైతుల సమస్యలు పరిష్కారం

విద్యుత్ ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

మెట్‌పల్లిటౌన్/రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ట్రాన్స్‌కో అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ప్రతి సెక్షన్‌లో కనీసం రోజుకు రెండు చొప్పున ప్రమాదాలకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి వాటిని సరిదిద్ది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి క్షేత్రస్థాయి ఇంజనీర్లకు, సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి అనుగుణంగా మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలతో పాటు పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలో 1,61,340 సర్వీసులు ఉండగా అందులో వ్యవసాయ కనెక్షన్లు 59,844 ఉన్నాయి.

● కదిలిన విద్యుత్ యంత్రాంగం

కొద్ది రోజుల నుంచి డివిజన్ వ్యాప్తంగా ప్రతి సెక్షన్‌లో క్షేత్ర స్థాయి సిబ్బంది తాము గుర్తించిన సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటిని సరిదిద్దే పనికి ఉపక్రమించారు. చిన్న పనులను స్థానిక సిబ్బంది నిర్వహిస్తూ, పెద్దవాటిని కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తూ రోజువారీగా ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు అప్లోడ్ చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు ఏ సెక్షన్‌లో ఏ పని జరుగుతున్నదో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ సమస్యలు, సామర్థ్యం పెంపుదల, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, కొత్త కనెక్షన్ల మంజూరు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు, వంగిపోయిన స్తంభాలు, వదులుగా వేలాడుతున్న తీగలు తదితర అంశాలపై దృష్టి సారించారు.


ఆరపేట వద్ద పొలంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఇది నిరంతర ప్రక్రియ

-జి.మధుసూదన్, డీఈ, మెట్‌పల్లి



ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తాం. స్వీయ రక్షణ జాగ్రత్తలు తీసుకోకుండా పని చేసే సిబ్బందిని గుర్తించి వారి జీతంలో కోత విధిస్తున్నాం.

నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు

-దురిశెట్టి మనోహర్, ఏడీఈ, మెట్‌పల్లి



ప్రతీ గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలపై క్షేత్ర స్థాయి సిబ్బంది దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాబోయే కాలంలో విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తగ్గించాలనేదే మా లక్ష్యం. అందుకు సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

● ప్రతీ వారం పొలం బాట..

క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవడానికి నేరుగా రైతుల వద్దకే వెళ్ళి మాట్లాడి తక్షణం పరిష్కరించడానికి ప్రతీ వారం ఒక రోజు పొలం బాట కార్యక్రమాన్ని రూపొందించినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ల ఓవర్‌లోడ్ సమస్యలు, సామర్థ్యం పెంపుదల తదితర అంశాలపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పొలం బాటలో ఆయా సమస్యలను పరిష్కరిస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం లేకుండా రైతులు స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్‌లు మార్చకుండా ట్రాన్స్‌కో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు

● ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి అనిల్ బ్యాండు కొట్టడానికి వెళ్లి తిరిగి లింగాపూర్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో మెట్‌పల్లి గ్రామానికి చెందిన బాకారపు అజయ్ మెట్‌పల్లి నుంచి చింతలపల్లికు వెళ్తుండగా, లింగాపూర్-చింతలపల్లి గ్రామాల మధ్యలోని మూలమలుపు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం ఆర్టీసీబస్సు కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్, రాజు, మహేశ్, మణికాంత్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దేవేందర్, రాజు, మహేశ్, మణికాంత్ కలిసి కారులో సిరిసిల్ల నుంచి రాచర్లబొప్పాపూర్ మీదుగా గంభీరావుపేటకు వెళుతున్నారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సు ఎదురుగా ఢీకొట్టింది. కారు పూర్తి దెబ్బతింది. కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై శనివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యైటింక్లయిన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియం సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద మేస్తున్న ఆవులను అల్లూరుకు చెందిన గంట యాకయ్య, గంట సారయ్య, ఆవుల కొంరయ్యలు మరికొందరితో కలసి తాళ్లతో ఆవులను బంధించి బలవంతంగా ఆటో ట్రాలీలోకి ఎక్కిస్తుండగా అటుగా పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులకు పట్టుబడ్డారు. ఏఎస్సై కృష్ణ ముగ్గురిని అదుపులోకి తీసుకుని ట్రాలీతో పాటు స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిని విచారించిన అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. పశువులను దుండించడం, అక్రమంగా తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విత్తన వ్యాపారి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మంకమ్మతోటలోని కొత్తలేబర్ అడ్డా వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడు ప్రమాదంలో సీడ్‌వ్యాపారి చాడకిషన్‌రెడ్డి (57) మృతిచెందాడు. అతడిభార్యకు గాయాలయ్యాయి. కరీంనగర్ రెండోఠాణా సీఐ సృజన్‌రెడ్డి వివరాల ప్రకారం... పెగడపల్లి మండలం నామాపూర్‌కు చెందిన చాడ కిషన్‌రెడ్డి సీడ్‌వ్యాపారం చేస్తూ కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తన భార్య రమాదేవితోకలిసి బైక్‌పై మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిషన్‌రెడ్డి, అతడి భార్యకు గాయాలయ్యాయి. ఇద్దరినిప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడి సమీప బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కిషన్‌రెడ్డి ఇద్దరు కూతుళ్ల ప్రస్తుతం ఆమెరికాలో ఉంటున్నారు.

పోలీస్ పహారా మధ్య యూరియా పంపిణీ

● యూరియా వచ్చిందనే సమాచారంతో ఉదయాన్నే చెప్పులు లైన్లో పెట్టిన రైతులు


వెన్కేపల్లి ఎల్‌ఎస్‌సీఎస్ వద్ద రైతులను ఒకరి తర్వాత ఒకరిని యూరియా కోసం పంపిస్తున్న పోలీసులు

సైదాపూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి విశాల సహకార సంఘంలో శనివారం వ్యవసాయాధికారుల పర్య వేక్షణ, పోలీసుల పహారాలో సొసైటీ సిబ్బంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయమే పెద్దఎత్తున సొసైటీ గోదాముకు వచ్చి చెప్పులు లైన్లో పెట్టారు. విషయం తెలుసుకున్న వ్యవసా యాధికారులు గోదాము వద్దకు వెళ్లి యూరియా సరిపడా ఉందని ఎవరూ ఆందోళన చెంద వద్దని రైతులకు సర్దిచెప్పి లైన్లో నిలబెట్టారు. సొసైటీ సిబ్బంది, వ్యవసాయాధి కారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీ సులు గోదాము వద్దకు చేరుకొని రైతులను ఒకరి తరువాత ఒకరు యూరియా తీసుకునేలా చూశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరారు.

● బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన..

యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారనే సమాచారంతో బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు వెన్కేపల్లి సొసైటీ గోదాముకు చేరుకొని కొంతసేపు ఆందోళన చేపట్టారు. రైతులకు సరిపడా యూరియా అందించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా పంపిణీచేయాలని డిమాండ్‌చేశారు. రైతులకు సరిపడా యూరియా అందించడంతో కాంగ్రెస్‌ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య అన్నారు. పండగపూట ప్రశాంతత లేకుండా యూరియా కోసం లైన్లో నిలబడే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవతీసుకొని రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు.

కొత్త కవుల వేదిక కరీంనగర్

● 148వ ఎన్నీల ముచ్చట్లలో డాక్టర్ రఘురామన్



మాట్లాడుతున్న డాక్టర్ రఘురామన్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొత్త కవులకు వేదికగా కరీంనగర్ నిలుస్తోందని, కవిత్వ రచనకు శిక్షణ ఇచ్చే కార్యశాల ఎన్నీల ముచ్చట్లని సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్ అన్నారు. శనివారం పౌర్ణమి సందర్భంగా ఐఎంఏ హాల్‌లో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 148వ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల సాహిత్యాభిమానులు ఉత్తమకవిత్వం కోసం కరీంనగర్‌వైపు చూస్తున్నారన్నారు. అనంతరం ఇటీవల దాశరథిపురస్కారాన్ని అందుకున్న అన్నవరం దేవేందర్‌ను డాక్టర్ రఘురామన్, డాక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్ సన్మానించారు. అనంతరం రచయితలు తమ రచనలను వినిపించారు. తెరవే అధ్యక్ష,కార్యదర్శులు సీవీకుమార్, దామరకుంట శంకరయ్య సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పీఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, వెల్మల కృష్ణారావు,చైతన్యవిజయశ్రీ, జలంధర్‌రెడ్డి, యుగంధర్, ఖాలిద్, మురళి, సమ్మయ్య, రమణయ్య, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శనివారం పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్నసన్నిధికి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరత్రా పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


కొండగట్టులో ఆలయం ముందు భక్తులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనిమహిళ మృతిచెందింది. గ్రామంవద్ద శుక్రవారంరాత్రి రోడ్డుదాటుతున్న యాసర్ల అంజమ్మ(50) గుర్తు తెలియని వాహనం ఢీకొందని, తీవ్రగాయాలతో ఆమె మృతి చెందిందని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం వెతుకుతు న్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం

● కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకీ లభ్యం కావడంతో కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కుటుంబసభ్యులకు శనివారం అప్పగించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన పులి లక్ష్మి ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కొడుకు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. కాగా, శనివారం కనగర్తి, మల్కపేట గ్రామాల రోడ్డు పక్కన చెట్ల పొదల్లో మహిళ మతిస్థిమితం లేకుండా పడిపోయి ఉండగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

భూ సమస్య పరిష్కరించాలని టవరెక్కిన రైతు


టవర్‌పై రైతు ప్రకాశ్‌రెడ్డి

ధర్మారం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తన పాలుకు వచ్చిన భూమిని తన అన్న అక్రమంగా పట్టా చేసుకున్నాడని, తన భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు టవర్‌ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. ధర్మారం మండలంలోని నల్లలిం గయ్యపల్లి గ్రామానికి చెందిన యాళ్ల ప్రకాశ్‌రెడ్డికి సంబంధించిన 29 గుంటల భూమి తనఅన్న యాళ్ల నర్సింహారెడ్డి అక్రమంగా పట్టా చేసుకుని దున్నుకుంటున్నాడని ఏళ్లు గడుస్తున్నా తన సమస్యకు పరిష్కారం కావడం లేదని ప్రకాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం తన భూమిని నర్సింహారెడ్డి ట్రాక్టర్‌తో దున్నుతుండగా అడ్డుకోగా తన అన్నతోపాటు అతని కుమారుడు జగదీశ్వర్ రెడ్డి తనపై దాడికి యత్నించారని తెలిపారు. 13సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగినా సమస్యపరిష్కారం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది పురుగులమందు డబ్బాతో టవర్ ఎక్కినట్లు తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రకాశ్‌రెడ్డితో ఫోన్ మాట్లాడి నచ్చజెప్పారు. సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ప్రకాశ్‌రెడ్డి టవర్ దిగాడు. ఏళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది టవర్ ఎక్కినట్లు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లగా పెను ప్రమాదం తప్పింది. ఓ వ్యక్తి తన కారులో శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాడికల్ గ్రామ శివారులో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టులో పడిపోయి పొలంలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులోని వ్యక్తిని బయటకు తీశారు. ఆయన క్షేమంగానే ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా లేక ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోయిందనే విషయం తెలియాల్సి ఉంది.

పిడుగు పడి గొర్రెలు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాన్‌సాయిపేట గ్రామశివారులోని అటవీప్రాంతంలో శనివారం పిడుగుపడి ఒక మేక, 15 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం నుంచి ఎల్లయ్యే అనే గొర్రెల కాపరి మేత కోసం తన మేకల, గొర్రెల మందతో వెళ్లగా ఒక్కసారిగా కురిసిన వర్షానికి తోడు పిడుగుపడి మేక, గొర్రెలు మృతిచెందినట్లు తెలిపారు. తనకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు ఎల్లయ్య కోరారు.

వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ ప్రారంభం


గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

కొడిమ్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని భక్తులు ప్రారంభించారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని, పూడూర్ సాయిబాబా ఆలయాల్లో గ్రామస్తులకు భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై హింసను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద శనివారం పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ప్రజాసంఘాలు నిరసన చేపట్టాయి. అంతర్జాతీయ ఆది వాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి కంపెనీలకు అపార ఖనిజ సంపదను దోచిపెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడవి బిడ్డలను హింసిస్తోందని విమర్శించారు. బస్తర్‌లో 250 పోలీస్ క్యాంపులను ఏర్పాటు చేసి 8 లక్షల పారామిలటరీ పోలీసులతో బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా ఆదివాసీలను కనుమరుగయ్యేలా చేస్తున్నా రని ఆవేదన చెందారు. 2005లో సల్వాజుడుం, 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్, 2015లో ఆపరేషన్ సమాధాన్, 24లో ఆపరేషన్ కార్ పేరుతో ఆరు నెలల పసిపాప మండ్లి సోడి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు నిర్ధాక్షిణ్యంగా చంపివేస్తున్నారని అన్నారు. 13 నెలల్లోనే 600 ఆదివాసీ ప్రజలను ప్రభుత్వం చంపి వేసిందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకూరి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, పౌరహక్కుల ప్రజా సంఘాల నాయకులు వినోద్, ఎరుకల రాజన్న, కట్ట విశ్వనాథ్, రత్నకుమార్, రామిల్ల బాపు, గాండ్ల మల్లేష్, యాదవనేని పర్వ తాలు, బండారి రాజలింగయ్య, నక్క సత్యనారాయణ, బండి శంకర్ గౌడ్, బియ్యాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీలో రుక్మాపూర్ యువకుడి ప్రతిభ

● ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు ఎంపిక



భానుప్రసాద్

చొప్పదండి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జాజ్-24 (ఈఎస్ఈ)కు చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని భానుప్రసాద్ ఎంపికయ్యాడు. గతేడాది యూపీఎస్సీ2024లో నిర్వహించిన ఈఎస్ఈ(ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్) మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచి ఎలక్ట్రానిక్స్ టెలికాం ఇంజనీరింగ్ విభాగంలో భానుప్రసాద్ ఎంపిక అయ్యాడు. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జాం ఫలితాలను యూపీఎస్సీ మేలో విడుదల చేయగా రెండో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో భానుప్రసాద్‌కు చోటుదక్కింది. జాతీయ స్థాయిలో ప్రవేశపరీక్ష నిర్వహించగా 40వ ర్యాంక్ సాధించిన భానుప్రసాద్ మూడో ప్రయత్నంలో ఎంపిక య్యాడు. ఇంటర్ వరకు కరీంనగర్‌లో చదివి, హైదరాబాద్ సీబీఐటీలో బీటెక్ పూర్తిచేసిన భానుప్రసాద్ ప్రైవేట్‌కంపెనీలో కొంతకాలం ఉద్యోగం చేశాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా తల్లి వ్యవసాయం చేసుకుంటూ కొడుకును చదివించింది. భానుప్రసాద్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లో రద్దీని పరిశీలించిన ఆర్ఎం



సిబ్బందికి ఆహారప్యాకెట్లు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్‌స్టేషన్‌లో రాఖీ పౌర్ణమి రద్దీని కరీంనగర్ రీజినల్ మేనేజర్ బీరాజు, డిప్యూటీరీజినల్ మేనేజర్ ఎస్. భూపతిరెడ్డి పరిశీలించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విధినిర్వహణలో ఉన్నసిబ్బందికి ఆహారప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌లు విజయమాధురి, ఎం శ్రీనివాస్, పి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పండుటాకుల బతుకుల్లో వెలుగు రేఖ..



● తల్లడిల్లే వృద్ధులకు ఆసరాగా నిలుస్తున్న శ్రీరామసాయి వృద్ధాశ్రమం
● ఆశ్రమంలో 21మంది వృద్ధులు

ఇల్లందకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీరామసాయి వృద్ధాశ్రమం పండుటాకుల బతుకుల్లో వెలుగు నింపుతోంది. 21మంది వృద్ధులు ఆశ్రమంలో ఉంటున్నారు. మలిసంధ్యలో కొడుకులు, కోడళ్ల, మనుమలు, మనుమరాళ్లతో ముచ్చట్లు పెడుతూ కాలక్షేపం చేయాల్సిన వృద్ధులు ఆదరణకు దూరమవడంతో వారిని అక్కున చేర్చుకొని ఈ ట్రస్టు పలువురికి నీడనిస్తుంది.

మంచి భోజనం పెడుతున్నారు



- మల్లారెడ్డి, వృద్ధుడు, కుందనపల్లి

శ్రీరామసాయి మానవ సేవాచారిట్రబుల్ ట్రస్టు ఈ ఆశ్రమం ప్రారంభించినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాను. ఇక్కడ సమయానికి అనుగుణంగా భోజనం పెడుతున్నారు. విశాలమైన గదులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో హాయిగా ఉంది.

● విశాలమైన గదులు..

దాతల సహాయ సహకారాలతో కోట్లాది రూపాయలతో సుమారు 25గదులను అన్ని వసతులతో నిర్మించారు. ఈ ఆశ్రమాన్ని 2017అక్టోబరు 14న అప్పటి మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించగా ప్రస్తుతం 21మంది వృద్ధులు ఆశ్రమం పొందుతున్నారు.

మంచిగానే చూసుకుంటున్నారు.



- ఐలమ్మ, వృద్ధురాలు, రాచపల్లి

మూడు సంవత్సరాలుగా ఆశ్రమంలో ఉంటున్నాను. ఇక్కడ మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచిగానే చూసుకుంటున్నారు. కన్నవారిని సైతం మరిచిపోయేలా ఇక్కడ ఉన్నటువంటి వారితో కలిసిమెలిసి కాలక్షేపం చేసుకుంటూ జీవిస్తున్నాం.

● ఆహ్లాదకరమైన వాతావరణం...

రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఆశ్రమంలో పూలమొక్కలు, నీడనిచ్చే రకరకాల చెట్లు ఉండడం వల్ల ప్రశాంతమైన వాతావరణంలో ఆనందంగా ఉంటున్నారు. అంతేకాకుండా ఆశ్రమంలో దేవాలయం, చక్కటి గార్డెనింగ్, కూర్చోడానికి బెంచీలు, వృద్ధులకు ఆసరాగా ఉపయోగపడుతున్నాయి.

● మెనూ ప్రకారం భోజనం...

ఉదయం 7గంటలకు టీ, 9గంటలకు అల్పాహారం, 10:30గంటలకు అధ్యాత్మిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 1:30గంటలకు భోజనం, 3గంటలకు విశ్రాంతి, సాయంత్రం 4:30గంటలకు బిస్కేట్స్, టీ, 6గంటలకు విశ్రాంతి, రాత్రి 7గంటలకు భజన, 7:30గంటలకు విశ్రాంతి, 8:30గంటలకు భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమణ.



ఇల్లందకుంటలోని శ్రీరామసాయి వృద్ధాశ్రమం

దాతలు ముందుకు రావాలి



- ఐచ్చు శివకుమార్, ట్రస్టు కార్యదర్శి, ఇల్లందకుంట

ఈ ఆశ్రమాన్ని దాతల ఆర్థిక సహాయ సహకారాలతో నడిపిస్తున్నాం. దాతలు ఎవరైనా ఉంటే మలిదశలో ఉన్నటువంటి వృద్ధులకు అండగా విరివిగా విరాళాలు అందజేసి ఆశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి.

తొమ్మిదేళ్లుగా ఆశ్రమాభివృద్ధికి కృషి..



- ఆదిరెడ్డి, ట్రస్టు మేనేజర్, ఇల్లందకుంట

వృద్ధాశ్రమం స్థాపించినప్పటి నుంచి మా వంతుగా, దాతల సహకారాలతో ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇందులో ఉండే వృద్ధులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉంటున్నారు. ట్రస్టు డెవలప్‌మెంట్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

దోస్త్ స్పాట్ అడ్మిషన్లలో ప్రభుత్వ డిగ్రీకళాశాలలకు అవకాశం ఇవ్వాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వివిధకారణాల చేత ఇప్పటివరకు రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లు పొందని విద్యార్థులకు కల్పిస్తున్న దోస్త్ స్పాట్ అడ్మిషన్ల సౌకర్యం అన్ని ప్రభుత్వ డిగ్రీకళాశాలలకు వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వకళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి శనివారం ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల13,14వ తేదీల్లో స్పాట్‌అడ్మిషన్లు చేపట్టనున్నట్లు దోస్త్ కన్వీనర్ షెడ్యూల్ ప్రకటించారని తెలిపారు. వాటిలో కేవలంప్రైవేట్ కళాశాలలకు మాత్రమే అవకాశం కల్పించారని, ఇది పూర్తిగా అర్థరహితమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకసంఘం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా అధ్యాపకమిత్రులు వాల్‌పోస్టర్ల ద్వారా, కరపత్రాలద్వారా ప్రచారంచేస్తూ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలియజేస్తూ, ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.

కొండెక్కిన కొబ్బరి కాయ

● రూ. 35 నుంచి రూ.40 పలుకుతున్న ధర
● రెండు నెలల్లో రూ.20 పెంపు
● శ్రావణమాసంలో భక్తులకు ఇబ్బందులు

హుజూరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండా మంటే కొబ్బరికాయల ధరలు కొండెక్కాయి. రెండు నెలలుగా కొబ్బరికాయ ధరలు పెరుగుతూ వస్తుండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు బహిరంగ మార్కెట్లో రూ.20కి దొరికిన కొబ్బరికాయ, ప్రస్తుతం పట్టణాల్లో రూ.35, గ్రామీణ ప్రాంతాల్లో రూ.40కి విక్రయిస్తున్నారు. వ్యాపారులు సిండికెట్ కావడమే కారణమని పలువురు అంటున్నారు. ఈ కొబ్బరికాయలు ఆంధ్రా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. కానీ ప్రస్తుతం మార్కెట్‌కు తగ్గట్టుగా కొబ్బ రికాయలు దిగుమతి కావడంలేదు. వచ్చిన కొబ్బరికాయలు కూడా చిన్నవిగా ఉంటున్నాయి. దిగుమతి అయిన కొబ్బరి



కాయలు సైతం ఐదారు రోజుల కంటే ఎక్కువ నిల్వ ఉండడం లేదు. శ్రావణమాసంలో ఎక్కువగా భక్తులు దేవాలయాలకు వెళ్తుంటారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో పోచమ్మ, భూదేవి ఉత్సవాలు జరుగుతున్నాయి. దేవుడికి నైవేద్యంగా కొబ్బరికాయలు కొడతారు. అధిక రేటు ఉన్నప్పటికీ భక్తులు కొబ్బరికాయలు కొనుగోలు చేస్తున్నారు.

● కొబ్బరికాయ ధరలు అమాంతంగా పెరిగాయి..

- ఆడెపు శ్రీనివాస్, స్థానికుడు, హుజూరాబాద్

శ్రావణమాసంలో కొబ్బరికాయ ధరలు అమాంతంగా పెరిగాయి. నెలరోజుల క్రితం రూ.20ఉన్న కొబ్బరికాయ నేడు పట్టణాల్లో రూ.35, గ్రామీణప్రాంతాల్లో రూ.40లకు విక్రయిస్తున్నారు. వచ్చిన కొబ్బరికాయలు నాసిరకంగా, చిన్నవిగా ఉంటున్నాయి. వారం రోజుల్లోనే కుళ్లిపోతున్నాయి.

ఆదివాసీ ప్రాంతాలపై ప్రభుత్వాల ఉక్కుపాదం

జ్యోతినగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతూ పాశవిక హననానికి పాల్పడుతున్నారని సీపీఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, పెద్దపల్లిడివిజన్ కార్యదర్శి తోకల రమేష్ ఆరోపించారు. శనివారం ఎన్‌టీపీసీలోని యూనియన్ కార్యాలయంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ అనే రాజకీయ సాంస్కృతిక సైనికవ్యూహం నేడు మధ్య భారతంలో కేంద్రప్రభుత్వ కనుసన్నల్లో అప్రతిహతంగా కొనసాగుతూ ఆదివాసీల ప్రాంతాల్లో అల్లకల్లోలం సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. పారామిలిటరీ సైన్యాలను, డిఆర్‌జీ తదితర పోలీసు, అటవీ అధికారులను వేలకోట్ల రూపాయాలు కుమ్మరించి ఆదివాసీలపైకి ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వనీతిని ఎండకడుతూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, ఆడేపు శంకర్, గూడూరి వైకుంఠం, రాయమల్లు, నర సయ్య, రాజయ్య, సురేష్, నాని పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల



కాకతీయ కాలువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదలను శనివారం అధికారులు కొనసాగించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీగేట్లు ఎత్తివేయడం, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ తదితర ప్రాజెక్టులు నిండడంతో ఎస్సారెస్పీలోకి 14,630క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 40.583 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 3వేలక్యూసెక్కులు, సరస్వతీకాలువకు 300క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, వరదకాలువకు 3వేల క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 360క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 32.807 టీఎంసీల వరద నీరువచ్చి చేరగా, 5.011 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

సాంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) సాంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా వ్యవస్థ ప్రముఖ్ మండె మల్లిఖార్జున్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పంచపరివర్తన అంశాలైన పర్యావరణ పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సమరసత, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం, పౌర నియమాలు పాటించడంపై అవగాహన కల్పించారు. రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట ఖండ కార్యవాహ తాటిపెల్లి మహేష్, కానుపాక కిషన్, నాగసముద్రాల బాలకృష్ణ, బొల్లం ధనుంజయ్, కంకటి శ్రీకాంత్‌లతో పాటు స్వయంసేవకులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సాహిత్యోత్సవంలో పెద్దింటి, పత్తిపాక



పెద్దింటి ఆశోక్, పత్తిపాక మోహన్

సిరిసిల్ల ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో బుక్ బ్రహ్మ ఫౌండేషన్ దక్షిణ భారత స్వరాలు పేరుతో ఈనెల8 నుంచి నిర్వహిస్తున్న సాహిత్యోత్సవంలో శనివారం సిరిసిల్లకు చెందిన కథకులు, సినీ రచయిత పెద్దింటి అశోక్, సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్‌లు పలు సదస్సుల్లో వక్తలుగా పాల్గొన్నారు. పెద్దింటి ప్రాంతీయ అస్తిత్వం సదస్సులో తెలంగాణ భాష అస్తిత్వ చేతనలపై మాట్లాడారు, మరో సదస్సులో పెద్దింటి సాహిత్యకారులు-సినీ రచనలు అంశంపై చర్చల పాల్గొన్నారు. బాల సాహిత్యం-రచనా కళా సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ తెలుగు బాల సాహిత్యం, భాష, నాడు-నేడు అంశాలపై చర్చించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

సుల్తానాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక స్వప్న కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్లంకి ప్రభాకర్, వొల్లాల అంజయ్య, నార్ల శ్రీనివాస్, పురుషోత్తంరావు, శ్రావణ్, అల్లాడి భగవాన్, భాగ్యమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బొంత కుంటపల్లి రామాలయంతోపాటు పలు వైష్ణవాలయాల్లో కళ్యాణోత్సవాలు జరిగాయి.



సుల్తానాబాద్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

లంబాడిపల్లిలో..

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలో గల పద్మావతీ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణ నక్షత్రం పుర్కరించుకొని శ్రీనివాస కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుపగా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇకనుంచి ప్రతినెలా శ్రావణనక్షత్రం రోజున కళ్యాణం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. అర్చకులు వికాస్ శుక్లా, విజయ్ సముద్రాలతో పాటు చైర్మన్ మరాఠి సత్తయ్య పాల్గొన్నారు.

వైభవంగా రుగ్వేద, యజుర్వేద ఉపాకర్మలు

● వేద మంత్రాలతో మార్మోగిన రాజన్న ఆలయ పరిసరాలు



అద్దాల మండపంలో యజ్ఞోపవీతం గావిస్తున్న రుగ్వేద బ్రాహ్మణులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా వేములవాడ పట్టణంలోని రుగ్వేద, యజుర్వేద బ్రాహ్మణులు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని అద్దాల మంటపంలో రుగ్వేద బ్రాహ్మణులు, నాగిరెడ్డి మంటపంలో యజుర్వేద బ్రాహ్మణులు ఆలయ స్థానాచార్యులు నమిలికొండ ఉమేష్ ఆధ్వర్యంలో ఉపాకర్మను ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన అగ్రహారంలోని 128 కుటుంబాలకు చెందిన బ్రాహ్మణులు సంప్రదాయ పద్ధతిలో ఆలయానికి చేరుకుని యజ్ఞోపవీతంలో పాల్గొన్నారు. యజ్ఞోపవీతంలో భాగంగా ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, అర్చకులు మామిడిపల్లి శరత్ గోపన్నగారి గణేష్, చందుల ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలు వేదమంత్రాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమానికి 300కు పైగా బ్రాహ్మణులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాపరామకృష్ణ, రవీందర్, ప్రతాప చంద్రమౌళి, మామిడిపల్లి రాజన్న, గర్శకుర్తి వెంకటేశ్వర్లు, పురాణం రాము, చొప్పకట్ల భాను, మల్లికార్జున్, గోపి, కృష్ణచంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో నెలకొన్న భక్తుల రద్దీ

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు స్వామివారి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజన్నను దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.



నాగిరెడ్డి మండపంలో యజ్ఞోపవీతంలో పాల్గొన్న యజుర్వేద బ్రాహ్మణులు



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు

ధర్మపురి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక బ్రాహ్మణ సంఘంలో వేదపండితులు కాసర్ల వంశీకృష్ణ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కలశ గణపతి పూజ, పృథ్విపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, ఉపాకర్మ ఉత్సవం జరిపారు. అనంతరం వేదబ్రాహ్మణులు నూతన యజ్ఞోపవీతాధారణ చేశారు. కార్యక్రమంలో ధర్మపురిపట్టణ బ్రాహ్మణసేవా సంఘం అధ్యక్షుడు ఇందారపు రామయ్య, ప్రధానకార్యదర్శి నందగిరి గిరిధర్, సంగనభట్ల దినేష్, మధ్వాచారి రాంకిషన్, కొరిడె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మపురిక్షేత్రంలో శ్రీవైష్ణవులు, పద్మశాలి కులస్థులు యజ్ఞోపవీతాధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవైష్ణవులు తమ ఇళ్లలో, శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలి కులస్థులు యజ్ఞోపవీతాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కొంక సుధీర్‌పాల్గొన్నారు.



ధర్మపురిలో పద్మశాలి సేవా సంఘంలో యజ్ఞోపవీత ధారణ

● లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ..

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరి గింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీఉగ్రనరసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. ఆల యం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

● మంత్రి అడ్లూరి పూజలు..

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం సందర్శించారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

లెక్కలు ఉండవు.. నిబంధనలు పాటించరు

(5వ పేజీ తరువాయి)

చెప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మంచినీటి సరఫరా స్టోర్‌ది అయితే ఏళ్ల తరబడి లెక్కలే లేవు. ప్రతియేడు మంచినీటి సరఫరా విభాగంలో కాంట్రాక్టర్ల ద్వారా లక్షల విలువైన సామగ్రిని కొనుగోలు చేస్తారు. నిర్వహణకు అవసరమైన సామగ్రి స్టోర్‌లలో అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. వీటితో పాటు పైప్‌లు, వాల్వ్‌లు, ఇతర మెటీరియల్ స్టోర్‌లలో ఉంటుంది. స్టోర్ ఇన్‌చార్జిలు, అధికారులు, స్టాక్ రిజిష్టర్లు, చార్జి సర్టిఫికెట్లు వంటి నిబంధనలు అమలైన పరిస్థితి లేదు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి తెప్పించిన పైపులు, కవర్లకు సంబంధించి లెక్కలే లేవు. ఈ మెటీయల్ తెచ్చిన కాంట్రాక్టర్లే మళ్లీ తమ అవసరాల కోసం తరలించుకుపోయారనే విమర్శలున్నాయి. గతంలో స్క్రాప్ విషయంలో నలుగురు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇప్పుడు పోలీస్ విచారణను ఎదుర్కొంటున్నారు. విజిలెన్స్ విచారణలో ఇప్పటికే చర్యలకు నివేదించింది. ఈ పరిస్థితుల్లో స్టోర్‌ల వ్యవస్థకు బాధ్యులను పెట్టి గాడిలో పెట్టకపోతే మరిన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది.



ఆర్‌జీ-1 కార్యాలయంలో వృక్షా బంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రక్షా బంధన్ సందర్భంగా ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో శనివారం వృక్ష బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ ఆవరణలో ఉన్న వేప చెట్టుకు ఆర్‌జీ-1 డీ లలిత్ కుమార్ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారని, అదే విధంగా రక్షా బంధన్ పండుగను అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తున్న మనం మానవ మనుగడకు ప్రాణ వాయువు అందిస్తున్న చెట్లను కూడా తోబుట్టువుగా భావించాలని, భుమిపై ఉన్నటువంటి కార్బన్ డైఆక్సిడ్‌ను పీల్చుకొని స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తున్న చెట్లు మన తోబుట్టువులతో సమానమన్నారు. ప్రతి ఒక్కరు కూడా రాఖీలతో సమానంగా చెట్లను నాటి పర్యావరణాన్ని మన ప్రకృతిని కాపాడాలని సూచించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని రక్షా బంధన్‌తో వృక్ష బంధన్ పండుగను జరుపుకోవాలని, ప్రతి ఒక్క కుటుంబం కుడా మన సొంత కుటుంబంలా ప్రకృతితో మమేకం కావాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఆంజనేయ ప్రసాద్, డీజీఎం(ఫారెస్ట్) బానోతు కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారులు ఆంజనేయులు, వీరారెడ్డి, వేణు, శ్రావణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, మురళి, మదర్ హ్యూమన్ యూత్ సొసైటీ పిట్టల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మెడికల్ బోర్డులో కార్మికులకు తీరని అన్యాయం

రామగిరి, ఆగస్టు 09(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గత వారంలో జరిగిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఏఐటీయుసీ డిప్యూటీ జనరల్‌సెక్రటరీ వై.వీరావు ఆరోపించారు. శనివారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రమోషన్ పాలసీ(గేడ్) డిటూసీ, సీ టూ బీ విధానం పై మేనేజ్మెంట్‌తో చర్చించామన్నారు. ఈ నెల చివరికల్లా బ్యాక్ డేట్ నుండి ప్రమోషన్ సర్క్యులర్ జారీ అయితాయని స్పష్టం చేశారు. గత వారంలో ప్లేడేలో మినిమం పర్సంటేజ్‌తో రాయడం పై సంస్థ యాజమన్యాంతో చర్చించినట్లు తెలిపారు. కొన్ని ట్రేడ్‌యూనియన్‌లో చేయని పనులను సైతం తామే చేస్తున్నామని చెప్పుకుంటూ తమ యూనియన్‌పై పుకార్లు పుట్టిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు బ్రాంచి సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, సిహెచ్‌పి ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు అమరగొండ పోశం, కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

లాభాలపై 40శాతం వాటా చెల్లించాలి



కార్మికులకు రాఖీ కడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి వాస్తవ లాభాలపై 40శాతం వాటాను జాప్యం లేకుండా కార్మికులకు చెల్లించాలని ఎస్‌సీకేఎంఎస్ (బీఎంఎస్) అధ్యక్షులు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో బీఎంఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం కార్మికులు కష్టపడి రికార్డు స్థాయిలో 70.12మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించారని, రూ. 40వేల కోట్ల వ్యాపారం జరిగిందని, గత సంవత్సరం పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించిన కార్మికుల కోసం ఈ సారి లాభాల వాటా 40శాతం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాట్ల లక్ష్మయ్య, సంగాని సాంబయ్య, చీకట్ల మల్లేశం, కుమ్మరి నాగేష్, ఆరెల్లి శ్రీకాంత్, చల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో రక్షాబంధన్



ఆర్జీ-2 జీఎం వెంకటయ్యకు
రాఖీ కడుతున్న మహిళా ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో శనివారం రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. జీఎం ఆఫీస్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు జీఎం బండి వెంకటయ్యతో పాటు ఇతర అధికారులకు, సిబ్బందికి రాఖీలు కట్టారు. రాఖీ పౌర్ణమి కేవలం పండుగ మాత్రమే కాదని, ఇది సోదర సోదరుల మమత, పరస్పర విశ్వాసం, రక్షణ బంధానికి ప్రతీకగా నిలుస్తుందని జీఎం అన్నారు. ఇటువంటి పండుగలు కుటుంబ ఐక్యతను, అనురాగాన్ని పెంపొదిస్తాయని జీఎం పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం(ఐఈ) మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



శ్రీధర్‌బాబుకు రాఖీ కడుతున్న దొద్ద గీతారాణి



మక్కాన్‌సింగ్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



విజయరమణారావుకు రాఖీ కడుతున్న మార్కెట్ చైర్మన్



చందర్‌కు రాఖీ కడుతున్న సోదరి



రాఖీ కడుతున్న కందుల సంధ్యారాణి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అక్కా, చెల్లెల్లు తమ స్వగ్రామాలకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు స్వగృహం శివపల్లి గ్రామంలో ఆయన సోదరితో పాటు పెద్దపల్లి మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టింటికి వచ్చిన ఆడపడుచులతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

గోదావరిఖని : రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంత్రి సీతక్క రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు రాఖీ కట్టారు. సీతక్కను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు ఘనంగా సత్కరించారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు తిలక్‌నగర్‌లోని ఆయన సోదరీమణులు రాఖీలు కట్టారు. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పలువురు బీజేపీ నాయకులకు రాఖీ కట్టారు.

సుల్తానాబాద్: సోదర సోదరీమణుల అనుబంధాలను ఆత్మీయతలను మరింత బలోపేతం చేసే రాఖీ పండుగను ఇంటింటా అందరూ ఘనంగా జరుపుకున్నారు. అక్కా చెల్లెళ్లు తమకు రాఖీ కట్టడం కోసం పుట్టింటికి రాగా వారికి అన్నా తమ్ముళ్లు ఎంతో ఆత్మీయతతో స్వాగతం పలికారు.

ముత్తారం : హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆయన నివాసంలో అడవిశ్రీరాంపూర్ మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మంథని: మంథని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ తన నివాసంలో పలువురికి రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు తన సోదరీమణులు రాఖీ కట్టారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుకు ఆరెల్లి శ్రీకృతి అనే చిన్నారి రాఖీ కట్టారు. రోడ్లు, బస్సులు, షాపింగ్ ఏరియా అంతా జనం రాకపోకలతో సందడిగా మారింది.

ఓదెల: మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాఖీ సందర్భంగా జనం రాకపోకలతో గ్రామాలు కళకళలాడాయి. అక్కాచెల్లెలు తమ గ్రామాలకు చేరుకొని అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టి వారి అనుబంధాన్ని చాటుకోగా,వారి ఆశీర్వాదాలతో ఆనందాలు పంచుకున్నారు.

జూలపల్లి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రాఖీపండుగ వేడుకలను శనివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆడబిడ్డల రాకతో ప్రతి ఇంటిలోని అన్నా తమ్ముల్లలో ఆనందం సంతరించుకుంది. రాఖీ కట్టిన అనంతరం సోదరులు తమ తోబుట్టువులైన అక్కాచెల్లెళ్లకు కట్నకానుకలను,చీరెసారెలను అందించారు.

ఎలిగేడు: మండలంలో రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోదరీసోదర ప్రేమలు, అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను ప్రజలు అత్యంత ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. అలాగే ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుకు సోదరి అంజక్కతోపాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపి, సోదరభావాన్ని చాటుకున్నారు. వారిని ఎమ్మెల్యే ఆశీర్వదించి, అభినందించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి తమ ఆప్యాయతను పంచుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇంటింటా పండుగ వాతావరణం నెలకొంది. పుట్టింటికి వచ్చిన మహిళలు తమ చిన్ననాటి స్నేహితులను పలకరించుకొని కుటుంబ విషయాలను పంచుకున్నారు. ఎంతో ఆనందంగా రాఖీ వేడుకలు జరుపుకున్నారు.

రామగిరి: మండలంలోని రాఖీ పండుగా వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. రాఖీ సందర్భంగా పల్లెల్లో మహిళలతో పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లెలోని ఐఎన్‌టీయుసీ సోషల్ మీడియా ఇన్‌చార్జి మేకల మారుతి తన సోదరీమణులతో మొక్కలకు రాఖీల కట్టి పండుగను జరుపుకున్నారు.



పుట్ట మధుకు రాఖీ కడుతున్న సోదరి



దుద్దిళ్ల శ్రీనుబాబుకు రాఖీ కడుతున్న చిన్నారి

శంకుస్థాపనకే పరిమితమైన మార్కెట్ యార్డు

పాలకుర్తి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాల రైతులకు ఉపయోగపడే పుట్నూర్ మార్కెట్ యార్డు శంకుస్థాపనకే పరిమితమైంది. రామగుండం మార్కెట్ కమిటీ పరిధిలో అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాల రైతుల కోసం పుట్నూర్‌లో గత బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన చేశారు. 2020న స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేసి సర్వే నెంబర్ 99లో 10 ఎకరాల స్థలాన్ని మార్కెట్ యార్డు కోసం కేటాయించారు. అనంతరం డిఎంఎఫ్‌టి ఫండ్ 15 లక్షల వ్యయంతో తేది 2022న అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మార్కెట్ కమిటీ నూతన భవనం, ప్రహరీ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించా రు. లెవలింగ్‌కు 5 లక్షలు, ఆఫీస్ బిల్డింగ్‌కు 10 లక్షలు, బోరింగ్ నిర్మాణం కొరకు 2 లక్షలు, ప్లాట్‌ఫామ్‌కు 10 లక్షలు, మరో పెద్ద ప్లాట్ ఫామ్‌కు అప్పటి కలెక్టర్ ఆదేశాలతో 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనుల పూర్తి కొరకు అప్పటి అధికారులు రూ. 2 కోట్ల 15 లక్షల నిధుల విడుదల కోసం ప్రపోజల్స్ పంపారు. మార్కెట్ యార్డు నిర్మాణం జరుగుతున్నట్లు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంతో ఆ మూడు మండలాల రైతులు సంతోషించారు. ఇద్దరు ఎమ్మెల్యేల పదవీ కాలం ముగిసినా కనీసం ప్రహరీ నిర్మాణం కూడా కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో పనులు పూర్తిచేసి రైతులకు మార్కెట్ యార్డు అందుబాటులోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.



పుట్నూర్ మార్కెట్ యార్డు శిలాఫలకం

చర్యలు చేపడుతాం



గడ్డం తిరుపతి, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మెన్

పుట్నూర్‌లో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం చర్యలు చేపడుతాం. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు విన్నవించి రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం.

రైతుల ఇబ్బందులు తొలగించాలి

ఆడెపు రాజేశం రైతు జయ్యారం



రైతులు పత్తి, ఇతర పంటలు అమ్మాలంటే పెద్దపల్లి, ధర్మారం లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ మార్కెడ్ యార్డు నిర్మాణం జరిగితే మూడు మండలాల రైతులకు ధాన్యం అమ్మడం సులువుగా ఉంటుంది.

పరామర్శ

రామగిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దాసరి శివను టిపిసిసి ప్రధాన కార్యదర్శి శనివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కల్వలశంకర్, అనవేన రాయమల్లు, దుర్కి కొమురయ్య, బొంతల రమేశ్, జెట్టవేన రంజిత్, మాతంగి కుమార్, ఇల్లందుల సంజీవ్, ఖాజపాష, నేదురు సురేష్, బుర్ర గట్టయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు శనివారం తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రాజేశ్వర్, అన్నమనేని తిరుపతి రావు, రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్, జిల్లా మండల బాధ్యులు పాల్గొన్నారు.

బీసీల బహిరంగ సభను
విజయవంతం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

భగత్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో ఈ నెల 14న కరీంనగర్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి కోరారు. చింతకుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు ఐదు నియోజక వర్గాల నుంచి అత్యధిక సంఖ్యలో బీసీలు హాజరయ్యేలా చూడాలన్నారు. 11న మరోసారి నియోజక వర్గ నాయకులతో సమావేశం అవుతున్నామని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఉన్నారు.

అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్ నుంచి ఈ నెల 14న అరుణాచల పుణ్యక్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. 14న గురువారం కరీంనగర్ బస్‌స్టాండ్ నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 15న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అదే రోజు రాత్రి అరుణాచలానికి చేరుకుంటుందన్నారు గిరి ప్రదక్షిణం దర్శనం అనంతరం అరుణాచలం నుంచి 16న శనివారం మధ్యాహ్నం బయలుదేరి మరుసటి రోజు జోగులాంబ దర్శనం తర్వాత 17న సాయంత్రం కరీంనగర్ చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో పెద్దలకు 4,700, పిల్లలకు 3,540 చార్జీలు ఉంటాయన్నారు. వివరాలకు 9959225920, 8074690491, 7382849352 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి

సుభాష్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తోందని ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విమర్శించారు. శనివారం కరీంనగర్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెలకు 700 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని, కాంట్రిబ్యూటరీ ఆధారిత ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ ప్రవేశపెడతామన్న ప్రభుత్వం ఇంతవరకు దాని ఊసే ఎత్తడంలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



పెద్దపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కాలనీలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిటౌన్/పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) యూత్ కాంగ్రెస్ 65 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్ ఆధ్వర్యంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నుముక లాంటిదన్నారు. పార్టీ ఇచ్చిన ఏ పిలుపునైనా యూత్ కాంగ్రెస్ తప్పకుండా పాటిస్తుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన వారు చాలామంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులయ్యారని గుర్తు చేశారు. యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భూషనవేణ సురేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్, మండల అధ్యక్షుడు జడల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రావన్, ఓదెల, జూలపల్లి మండలాల అధ్యక్షులు రాహుల్, దేవేందర్, నాయకులు రాకేష్, అయూబ్, నాంసాని శ్రీనివాస్, తూముల మహేష్, పవన్ కుమార్, శ్రీనివాస్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కాలనీలో కాంగ్రెస్ దాని అనుబంధ సంఘాలు ఘనంగా నిర్వహిం చాయి. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ యూత్ కాంగ్రెస్ జండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. 1960లో ఇందిరాగాంధీ ఆధ్వర్యంలో ఁయూత్ కాంగ్రెస్ ఆవిర్భవించిందని, దేశంలోని యువత సమాజం పట్ల బాధ్యతాయుతంగా మెలగడం, సేవా భావం పెంపొందించేలా పని చేస్తున్నట్టు మహేష్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, తిరుపతిరెడ్డి, చక్రపాణి, సారయ్య నాయక్, ప్రశాంత్, ఇరికి రాజేశ్వరి, శంకర్, నవీన్, కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: సమాజంలో మార్పు రావాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి అన్నారు. యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శివాజీనగర్‌లో శనివారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కౌటం సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ చేసి కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో ప్రతి ఒక్క యువకుడు దేశాభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు ప్రభుత్వంలో కొనసాగుతున్న మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు యువజన కాంగ్రెస్‌లో చురుకుగా పని చేసి ఈ స్థాయికి ఎదిగారని, దేశ భద్రత యువత చేతుల్లో ఉందన్నారు. యువకులను కాంగ్రెస్ పార్టీలో చేర్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పారపు శ్రీనివాస్, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాష్, చుక్కల శ్రీనివాస్, దూళికట్ట సతీష్, కుడుదుల శివ, నజీమోద్దీన్, బాబుమియా, సింహాచలం, దాసరి విజయ్, పంజా శ్రీనివాస్, ఆడెపు దశరథం పాల్గొన్నారు.

మంథని: యూత్ కాంగ్రెస్ అవిర్భావ వేడుకలను కాంగ్రెస్, వైసీసీ నేతలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



శివాజీనగర్‌లో జెండావిష్కరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు